ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5 సోమవారం 2 సెప్టెంబరు 2024



శావల్యాపురం: కొత్తలూరు వద్ద కొంకెరువాగులో నీటిఉధృతి



దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో పడవలో బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలింపు దృశ్యం

వరద.. వణుకు



తాడేపల్లి రైలు వంతెనల వద్ద కృష్ణమ్మ పరుగులు

- కృష్ణమ్మ మహోగ్రరూపం
- సాగర్‌కు రికార్డు స్థాయిలో వరద
- తెరపిచ్చిన వాన.. ఉధృతంగా వాగులు
- కృష్ణానది కుడి కరకట్టను తాకిన ప్రవాహం
- పలు ప్రధాన మార్గాల్లోనూ నిలిచిన రాకపోకలు
- భయం గుప్పిట్లో నదీ తీర, లంక గ్రామాల ప్రజలు
- ముంపులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్లు పర్యటన.. సహాయక చర్యల పరిశీలన
- ఎక్కడికక్కడ బాధితులు సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలింపు
- బ్యారేజీ నుంచి 10.10 లక్షల క్యూసెక్కులకు చేరిన వరద ప్రవాహం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు ముంచెత్తాయా.. అన్నట్లు వరుణుడు చెలరేగగా.. ఆ ప్రభావం ఆదివారం వరద రూపంలో ముంచెత్తింది. కుంభవృష్టితో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చిగురుటాకులా వణికిపోగా ఆదివారం వరుణుడు విరా మం తీసుకున్నాడు. అయినా కృష్ణమ్మ మహోగ్రంగా సాగరం దిశగా పరుగులు తీస్తోంది. కృష్ణమ్మ కన్నెర్రతో తీర ప్రాంత గ్రామాలు, డెల్టాలోని లంకలు, పల్లె వాసులు వణికిపోతున్నారు. ప్రాణ రక్షణతో భీతిల్లిపోతున్న వారిని అధికారులు ఎక్కడికక్కడ సహాయ శిబిరాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వాగులు, వంకలు రోడ్డెక్కగా.. పల్లపు ప్రాంతా లను వర్షపు నీరు చుట్టేసింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయా యి. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలైన నీటి ప్రవాహం లంకలను ముంచేస్తోంది. బ్యారేజ్‌కు ఆదివారం అర్ధరాత్రికి 10.10 లక్షల క్యూసెక్కులు చేరినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తలెత్తే ఎలాంటి పరిస్థితులునానై ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అధికారులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పై నుంచి వచ్చే వరద తోడవడంతో నష్ట తీవ్రత భారీగా పెరిగింది.

గుంటూరు, తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురిసిన వర్షాలతో కృష్ణానదితో పాటు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా.. ఆదివారం ముంచెత్తుతోన్న వరదతో ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఎటు చూసినా నీరే.. వాగులు వంకలు పొంగి పొలాలను ముంచెత్తగా ప్రధాన రహదారులు తటాకాలను మరిపిస్తున్నాయి. పలు కాలనీలు, లంక గ్రామాలు, నదీ తీర గ్రామాలను కృష్ణమ్మ చుట్టేసింది. పలు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు కూడా ముంపునకు గురయ్యాయి. రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం తగ్గుముఖం పట్టినా సాగర్ జలాశయం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి ప్రవాహం అసాధారణంగా దిగువకు వస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నా యి. పెదమద్దురు వద్ద వాగు అమ రావతి - విజయవాడ రహదారిపై ప్రవహిస్తోంది. పెదకూరపాడు తాళ్లూ రు - గుంటూరు రహదారిలో పరసా, కంభంపాడు వాగులు ఉధృతంగా ప్రవ హిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో వాహ నాల రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి మండలం మూడు లంక గ్రామాల్లో వరదలో చి క్కుకున్న 36 మందిని, 1150 జీవాలను ధరణికోట లోని సురక్షిత ప్రాంతానికి, ముంపునకు గురైన పెదమద్దూరులోని ఎస్సీ కాలనీవాసులను తరలిం చారు. అచ్చంపేట మండలంలో ముంపునకు గురైన వీరభద్రకాలనీలో 53 కుటుంబాలను అచ్చం పేట జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరానికి తరలించారు. సహాయ శిబిరాలను కలెక్టర్ అరు ణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సందర్శించి సహాయ చర్యలను పరిశీలిం చారు. పరిస్థితులు మెరుగయ్యే వరకు పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గండి పడిన దోసపాడు చెరువును సందర్శించి పూడిక పనులను పర్యవేక్షించారు. వరద ఉధృతంగా ఉండటంతో క్రోసూరు మండలం దొడ్లేరు చెరువుకు గండికొట్టి నీటిని బయటకు విడుదల చేశారు. పొలాలు ముంపునకు గురై నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో దొడ్లేరు - పీడు గురాళ్ల మధ్య రాకపోకలు స్తంభించాయి. క్రోసూ రు చెంచు కాలనీ ముంపు బాధితులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో నది ఒడ్డు న నివసిస్తున్న పల్లేకారులను పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాలకు మాచవరంలో 500 కోళ్లు మృతి చెందాయి. నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలోకి వర్షపు నీరు ప్రవేశించడంతో 50 కుటుంబాలను గ్రామం లోని పాఠశాలకు తరలించారు. నరసరావుపేట మండలం రాజుపాలెంలోకి వరద నీరు ప్రవేశిం చింది. నడికూడి జంక్షన్‌లో నిలిచిన పలు రైళ్లలోని ప్రయాణికులు ఆకలితో అలమిటిస్తున్న విషయం తెలిసిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ఆదేశాలతో ఆయన తనయుడు సాయినిఖిల్ రైల్వేస్టేషన్‌కు వచ్చి భోజనం, ఇతర పదార్థాలను అందజేశారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు సుమారు 10 వేల మందికి భోజనం, మంచినీరు, పాలు, పండ్లు అందిస్తూనే ఉన్నారు.

గేట్లెత్తేశారు..

నాగార్జునసాగర్ జలాశయానికి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చిచేరుతోంది. 5,61,364 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా అన్ని క్రస్ట్ గేట్లను 15 అడు గుల మేర ఎత్తి 5,77,786 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటి విడుదలతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి విడుదల ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సాగర్‌లో ప్రస్తుతం 308.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతలకు 6,84,800 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా ప్రకాశం బ్యారేజ్‌కు 6,74,800 కూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువన ఉన్న డ్యాంలతో పాటు మున్నేరు, బుడమేరు వాగుల నుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు 7 లక్షల క్యూసెక్కుల వరకు వస్తున్న వరద సాయంత్రానికి అది 9.2 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. మునేరు నుంచి 2.40 లక్షలు, పాలేరు నుంచి మరో 70 వేల క్యూసెక్కుల వరద బ్యారేజికి వచ్చి చేరుతోంది. దీంతో శనివారం నుంచే బ్యారేజి దగ్గర 70 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఆది వారం మధ్యాహ్నానికి వరద పెరిగి ఒకేసారి 8.27 లక్షల క్యూసెక్కులకు చేరింది. మునేరు నుంచి వచ్చే వరద 3 లక్షలకు చేరుతుందనేది నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. సోమవారం ఉదయానికి 10.50 లక్షల క్యూసెక్కులకు పైగానే వరద పెరి గే ప్రమాదం ఉంటుందని అంచనా.

రైళ్లు దారిమళ్లింపు.. కొన్ని రద్దు

భారీ వర్షాలు, ముంచెత్తుతోన్న వరదతో కొన్ని రైళ్లను దారిమళ్లించగా, మరి కొన్నింటిని అధికారులు ఏకంగా రద్దు చేశారు. పలు రైళ్లను గుంటూరు డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో దారి మళ్లిం చారు. ఖమ్మం, వరంగల్ జిల్లా ల్లో మెయిన్ లైన్ దెబ్బతినడంతో దూర ప్రాం తాలకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి వస్తున్న రైళ్లను విజయవాడ నుంచి గుంటూరు మీదగా దారి మళ్లిం చారు. కొన్నింటిని అయితే జగ్గయ్యపేట నుంచి మేళ్లచెరువు మీదగా విష్ణుపురం తీసుకొచ్చి అక్కడి నుంచి గుంటూరు, సికింద్రాబాద్ వైపుకు మళ్లించారు. దీంతో ఆదివారం ఈ మార్గం 200 శాతం కెపాసిటీని దాటింది. 11019 సీఎస్‌ఎంటీ ముం బై - భువనేశ్వర్, 11020 భువనేశ్వర్ - సీఎస్‌ఎంటీ ముంబై, 18519 విశాఖపట్టణం - ఎల్‌టీటీ రైళ్లను పగడిపల్లి, నడికుడి, గుంటూరు మార్గంలో నడిపింది. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మహబూబాబాద్-పగిడిపల్లి మీదగా సికింద్రా బాద్‌కు, 12749 మచిలీపట్నం - బీదర్, 12763 తిరుపతి - సికింద్రాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 12699 చెన్నై- చాప్రా, 12737 కాకినాడ పోర్టు - లింగంపల్లి, 12760 హైదరాబాద్ - తాంబరం, 12862 మహబూబ్ నగర్ - విశాఖ, 12740 సికింద్రా బాద్ - విశాఖ, 12968 జైపూర్ - చెన్నై సెంట్రల్ రైళ్లను కూడా ఈ మార్గంలోనే దారి మళ్లించారు. దీంతో ఈ మార్గంలో రెగ్యులర్ రైళ్లు గంటల తర బడి ఆలస్యంగా గమ్య స్థానాలకు చేరుకున్నాయి.



అమరావతి: ధరణికోటలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నేడు నాలుగు ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు రాకపోకలు సాగించే గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సోమవారం పూర్తిగా రద్దు చేశారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లను సోమవారం గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రెండు గంటల ఆల స్యంగా రీషెడ్యూల్ చేశారు. విజయవాడలో రైలు పట్టాలు దెబ్బతిన్న కారణంగా మచిలీపట్నం - ధర్మవరం, నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లను ఆది, సోమ వారాల్లో రద్దు చేశారు. ఈ నెల 2,3 తేదీల్లో 07783 విజయవాడ - గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి- మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు - విజ యవాడ, 07276 కాచీగూడ - మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా రద్దు చేశారు.


బాపట్ల జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక

గుంటూరు, పల్నాడుకు రెడ్‌అలర్ట్

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వర్షం తెరిపిచ్చింది కదా అని గుంటూరు, పల్నాడు ప్రజలు ఊపిరి పీల్చు కుంటున్న తరుణంలో వాతావరణ శాఖ పిడుగు లాంటి హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటిన విషయం తెలిసిందే. అయితే తీరం దాటిన తర్వాత ఈ వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించారు. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్, బాపట్ల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ని జారీ చేశారు. తీరం వెంట బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఈ కారణంగానే ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలలకు సోమవారం సెలవు దినాన్ని ప్రకటిం చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల నిర్వహించకూడదని ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



అమరావతి వద్ద కృష్ణమ్మ వరద ప్రవాహం



కొండవీడు ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండచరియలు



పెదకూరపాడు: 75 తాళ్ళూరు నుంచి గుంటూరు వెళ్ళే రోడ్డులో లోలెవల్ చప్టా పై ఉధృతంగా వర్షపు నీరు



నడికూడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు భోజనం అందజేస్తున్న యరపతినేని నిఖిల్



పల్నాడులో వరదనీటిలో పత్తిపంట

వర్షపాతం ఇలా..

పల్నాడు జిల్లా అంతటా శనివారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటు వర్షపాతం 381.9 మీమీ నమోదైనట్లు వాతావరణ శాఖ ఆదివారం తెలిపింది. మండలాల వారీగా వర్షపాతం..

మండలం	(మీమీల్లో)
మాచర్ల	164.6
వెల్దుర్తి	135.4
దుర్గి	120.6
రెంటచింతల	139.4
గురజాల	146
దాచేపల్లి	156
కారంపూడి	117.2
మాచవరం	180.6
బెల్లంకొండ	130.6
అచ్చంపేట	190
క్రోసూరు	167.4
అమరావతి	127.8
పెదకూరపాడు	130.8
బొల్లాపల్లి	148
వినుకొండ	85.8
శావల్యాపురం	116.6
ఈపూరు	94.8
రొంపిచర్ల	248.2
నరసరావుపేట	125.4
ముప్పాళ్ల	186
నాదెండ్ల	83.8
చిలకలూరిపేట	106.2
యడ్లపాడు	97.4

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com





బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె, రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరపున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తు పెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్ల ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.




2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు



లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్విక గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.

సున్నా నుంచి 35 మార్కులు



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్విక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రయాణికుల ఆకలి బాధ తీర్చిన యరపతినేని



నడికూడి రైల్వే జంక్షన్‌లో ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని తనయుడు సాయినిఖిల్

దాచేపల్లి, సెప్టెంబరు 1: అల్పపీడన ప్రభావంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన పలు రైళ్లను నడికూడి జంక్షన్ మీదుగా దారి మళ్లించారు. ఒక్కసారిగా ప్రయాణ మార్గం మారడంతో భోజన, పానియాలకు ప్రయాణికులు అల్లాడిపోయారు. చాలా దూరం నుంచి వస్తున్న ప్రయాణికులు వారితోనే ఉన్న చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఆకలి బాధను ఓర్వలేకపోయారు. విషయం తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన కుమారుడు సాయినిఖిల్‌ను నడికూడి రైల్వేజంక్షన్‌కు పంపారు. అక్కడ వేడి భోజనం తయారు చేయించి ప్యాక్ చేసి రైళ్లలో ప్రయాణిస్తున్న వారికి అందజేశారు. చాలినన్ని తాగునీరు, పిల్లలకు పాల ప్యాకెట్లు నిఖిల్ అందజేశారు. గరీబ్‌రథ్, ఎల్‌టీటీ, విశాఖ, కోనార్క్, గోదావరి, విశాఖ-బీబీనగర్, బీదర్-మచిలీపట్నం రైళ్లు నడికూడి జంక్షన్ మీదుగా ప్రయాణించాయి. ఆదివారం ఉదయం నుండి అర్ధరాత్రి వరకు సుమారు 10 వేల మంది ప్రయాణికులకు భోజనం, మంచినీరు, పాలు, పండ్లు అందిస్తూనే ఉన్నారు. యరపతినేని తనయుడు సాయినిఖిల్, టీడీపీ శ్రేణులు ఏసీ బోగీ, సాధారణ బోగీలలోకి వెళ్లి వృద్ధులకు, చిన్నారులకు ఆహార పదార్థాలను స్వయంగా అందజేశారు.

యరపతినేనికి సీఎం చంద్రబాబు అభినందనలు

రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు భోజనం, పాలు, పండ్లు, మంచినీరు ఇచ్చి సహాయక చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనలు తెలిపారు. ఆదివారం నడికూడి రైల్వేస్టేషన్ మీదుగా దారి మళ్లించిన పది రైళ్లలోని ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రయాణికులకు పండ్లు, భోజనం, వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు, పెరుగు, బిస్కెట్ ప్యాకెట్లను యువనాయకులు యరపతినేని సాయినిఖిల్ పర్యవేక్షణలో ఆయారైళ్లలోని ప్రయాణికులకు అందజేశారు. ఈ విషయం వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా సీఎం పేషీకి సమాచారం అందింది. కేవలం 3 గంటల సమయంలోనే 10 వేల మందికి భోజనం, పండ్లు పంపిణీ చేయడం ప్రశంసనీయమని సీఎం చంద్రబాబు అభినందించినట్లు ఎమ్మెల్యే యరపతినేని తెలియజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 1 : పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నందివెలుగు రోడ్ లో గుర్తు వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. నందివెలుగు రోడ్ లోని మురుగు కాలువ లో పడ్డ వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై నల్ల గళ్ళ చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పాత గుంటూరు సీఐ.8688831325 కి సమాచారం అందజేయాలని కోరారు.

వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది

- ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు
- పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు

అమరావతి, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా పల్నాడు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో అమరావతి మండల పరిధిలో ముంపుకు గురైన కాలనీలను, కృష్ణానదిలో పెరుగుతన్న నీటి ప్రవాహాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. ప్రధానంగా ధరణికోట గ్రామంలో జైయిల్‌సింగ్ కాలనీలో వరద ముంపునకు గురైన నివాసగృహాలను పరిశీలించి త్వరితగతిన వరద నీరు బయటకు పంపించే ప్రక్రియను చేపట్టాలని మండల అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో ఉన్న మూడు లంక భూములలో ఉన్న 1150 మూగజీవాలు, 36మంది కాపరులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి సుమారు 7లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నందున తీరప్రాంతంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలో 38సెం.మీ వర్షపాతం నమోదైందని వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షిత క్యాంపులలో



అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు



లంక భూముల నుంచి తీసుకువస్తున్న మూగజీవాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ఉన్నవారికి భోజన వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముంపు తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారుల వెంట జేసీ సూరజ్ ధనుంజయ్, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఆర్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీరభద్ర కాలనీ వాసుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు సందర్శించారు. జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి 54 కుటుంబాలకు చెందిన 120 మందికి భోజనం వడ్డించారు. భారీ వర్షాలకు అచ్చంపేట వీరభద్రుని కాలనీలోకి నీరు ప్రవేశించటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు శనివారం రాత్రి పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితులకు భోజనం అందిస్తున్నారన్నారు. కాలనీలో పరిస్థితులు మెరుగయ్యే వరకు పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరభద్ర కాలనీని సందర్శించి నీరు తగ్గగానే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ విలేకరులకు తెలిపారు. అనంతరం గండి పడిన దోసపాటి చెరువును సందర్శించి పూడిక తీత పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, అచ్చంపేట తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మీ బాధ ఎవరూ తీర్చలేనిది



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని

- ఉప్పలపాడు వాగు ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబీకులను పరామర్శించిన పెమ్మసాని

పెదకాకాని, సెప్టెంబర్ 1: 'మీ బాధ ఎవరూ తీర్చలేనిది. స్కూల్ యాజమాన్యం బాధ్యత వహించాలి. ప్రైవేట్ స్కూళ్లల్లో నిర్వహణా లోపంపై చర్యలు తీసుకునే బాధ్యత నాది.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామ శివారులోనీ వాగులో జరిగిన కారు ప్రమాదం తెలిసిందే. ఘటనలో మృతి చెందిన చిన్నారులు మాన్విక్ (9) కుటుంబాన్ని పెమ్మసాని ఆదివారం పరామర్శించారు. మాన్విక్ అమ్మమ్మ, తాతయ్యలతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. స్కూలుకు వెళ్లిన తమ మనవడిని తిరిగి ఇంటికి పంపించే క్రమంలో కనీసం సమాచారం ఇవ్వలేదని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరోపించారు. పిల్లల విషయంలో కనీస జాగ్రత్త కూడా తీసుకొని కారణంగానే ఈ ప్రమాదం ఎదురైందని కన్నీటి పర్యంతమయ్యారు. బాధలో ఉన్న కుటుంబీకులను ఓదార్చిన పిమ్మట పెమ్మసాని మాట్లాడుతూ ఈ బాధ ఎవరు తీర్చలేనిదని, ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణపై తాను చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నుంచి సరైన కమ్యూనికేషన్ లేని కారణంగా ప్రమాదం ఎదురైనట్లుగా కుటుంబ సభ్యులు తనకు వివరించారని చెప్పారు. గుంటూరు ఛానల్ లీక్ అయిన కారణంగా వర్షం నీరు గ్రామాల్లోకి చేరుతుండటంపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు నష్టపరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షల చెక్కును పెమ్మసాని అందజేశారు. తహసీల్దార్ టి. కృష్ణ కాంత్, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దుద్దుకూరి బూషి బాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ఉప్పలపాడు వాగు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు, ఉపాధ్యాయుని ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ప్రమాదానికి కారణమైన వాగు వద్ద వంతెన నిర్మాణానికి గానూ అధికారులకు పెమ్మసాని ఆదేశాలు ఇచ్చారు. ఏ స్థాయి వర్షాలు కురిసినా సరే, మరోసారి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని చెప్పారు. ఉప్పలపాడు గొల్లమూడి గ్రామాల మధ్యన త్వరలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. అలాగే వంతెన నిర్మాణానికి వి.వి.ఐ.టి కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని పెమ్మసాని తెలిపారు. అనంతరం వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా హై లెవెల్ ఛానల్ పొంగి దాదాపు 5 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునరావు తో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్. త్వరగా సిద్ధం చేయాలని, ఎంపీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసి బాబు, కొర్రపాటి సాంబశివరావు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు చెంచు కాలనీ వాసుల సమస్య పరిష్కరిస్తా



క్రోసూరులో చెంచు కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్

క్రోసూరు, సెప్టెంబరు 1: వరద ముంపునకు గురైన క్రోసూరు చెంచుకాలనీ వాసుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ హామీ ఇచ్చారు. ఆదివారం ముంపు కాలనీ వాసుల ప్రజలు పునరావాసం పొందుతున్న క్రోసూరు హైస్కూల్‌లో వారిని కలసి ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రతి సంవత్సరం వర్షా కాలంలో చెరువు నీరు పొంగటం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆయనకు మొర పెట్టుకున్నారు. వరద నీరు తగ్గగానే సమస్య పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కాలనీలోకి నీరు ఎటు నుంచి ప్రవేశిస్తుందో గుర్తించి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు తగ్గే వరకు కాలనీ వాసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని టీడీపీ కూటమి నాయకులను ఆయన ఆదేశించారు. ఆహారం, ఇతర సౌకర్యాలను బాధితులకు కల్పించాలన్నారు. పునరావాస కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం శ్మశాన వాటిక వద్ద ఉన్న క్రోసూరు చెరువులో లెవల్ చప్టాను ఆయన పరిశీలించి చప్టా మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నీటితో నిండి నిండు కుడలా ఉన్న క్రోసూరు చెరువును ఆయన పరిశీలించి స్థానిక టీడీపీ నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహాన్, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, తెలుగు రైతు అధ్యక్షుడు తోకా వెంకటరావు తదితరులు ఉన్నారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 1: కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందనీ, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్నవరంలంక, కొత్తూరులంక, కనిగిరిలంక, పెసరలంక, ఈపూరులంక గ్రామాల్లో మనోహర్ అధికారులతో పాటు పర్యటించారు. వరద ఉధృతి పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. కృష్ణానదికి 9 లక్షల క్యూసెక్కుల పైగా వరదనీరు వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెలీకాన్ఫరెన్స్‌లో చెప్పారనీ, లోతట్టు ప్రాంతాలు లంక గ్రామాల్లో నీరు చేరతాయని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు నిత్యవసర సరుకులు ప్రభుత్వం నుంచి అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. ఎవరూ ఇబ్బంది పడకుండా అందుబాటులో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు తదితరులు ఉన్నారు.



అన్నవరంలంకలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఆలోచన విరమించుకోవాలి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 1: కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి తమ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాలని చూస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను, రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలు ఆలోచనను విరమించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా తాలుకా కేంద్రాల్లో ఆదివారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గుంటూరు తాలుకా కేంద్రం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యోగుల పదవీవిరమణ అనంతరం ఏ మాత్రం భవిష్యత్ భద్రత, గ్యారంటీ లేని యూనిఫైడ్ పెన్షన్ స్కీంను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల నుంచి ఎలాంటి కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత పెన్షనర్స్ సంఘం నాయకులు పి.నాగరాజు మాట్లాడుతూ ఇది ఉద్యోగుల, ఉపాధ్యాయులకు ఉపయోగ పడే పింఛన్ పథకం కాదనీ వ్యతిరేకించమన్నారు. ఏపీఎస్టీవో నాయకులు ఎమ్ ఎన్ మూర్తి మాట్లాడుతూ యూపీఎస్ అంటే యూనిఫైడ్ పెన్షన్ స్కీం కాదని అది యూజ్లెస్ పెన్షన్ స్కీం అన్నారు.

ఆక్రమణల తొలగింపుతో ముంపు సమస్యలకు పరిష్కారం

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 1 : జనావాసాల్లో చోటు చేసుకున్న ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీల్లో పూడిక తీతతోనే భారీ వర్షాల సమయంలో ముంపు సమస్యల నుంచి శాశ్విత పరిష్కారం లభిస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట పట్టణంలో సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. గత నెల రోజులుగా ఆక్రమణలను తొలగిస్తుంటే అభ్యంతరాలు చెప్పిన వారే ఇప్పుడు ఫలితాలు చూసి అభినందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కుండపోత వర్షం కారణంగా పట్టణంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్తిపాటి పర్యటించారు. గడియార స్తంభం సెంటర్, కళా మందిర్ సెంటర్, మార్కెట్ సెంటర్లలో వరద నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, డ్రైనేజీలు పరిశీలించి మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. గత 50 ఏళ్లలో ఎప్పుడూ ఇంత వర్షపాతం నమోదు కాలేదని, వాటికి తోడు గత పాలకుల నిర్లక్ష్యం, పట్టణ అభివృద్ధిని గాలికి వదిలి వేయటంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచి పోయిందన్నారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవటం, పూడిక తీతలు చేపట్టకపోవటం వలనే రాష్ట్ర మంతా కొన్ని ప్రాంతాలు నీట మునిగాయని, రెండు నెలలుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ చొరవతో పూడిక తీతల కోసం మున్సిపాల్టీలకు నిధులు కేటాయించటం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు నిధులు ఇవ్వటంతో పనులు జరిగిన కొన్ని ప్రాంతాలు ముంపు భారి నుంచి తప్పించుకున్నాయన్నారు. మునిసిపల్ కమిషనర్ గోవిందరావు, సిబ్బంది డ్రైనేజ్‌లో పూడిక తీత పనులు గత రెండు నెలల నుంచి చేపట్టారని, వారిని ప్రత్తిపాటి అభినందించారు.



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

కొండవీడులో విరిగిపడిన కొండచరియలు

- రెండు రోజులు ఘాట్ మార్గం మూసివేత



కొండవీడు ఘాట్‌రోడ్డు ముఖద్వారం సమీపంలో రోడ్డుకు అడ్డంగా జారిపడిన భారీ బండరాయి

కొండవీడుకోట(యడ్లపాడు), సెప్టెంబరు 1 : భారీ వర్షాల కారణంగా కొండవీడు కోట ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ముఖద్వారం, మూల మలుపుల్లో కొండచరియలు విరిగి భారీ బండరాళ్ళు రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన అటవీశాఖాధికారులు కొండ దిగువన ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపివేశారు. ఆర్‌అండ్‌బి అధికారుల సహకారంతో రోడ్డులో విరిగిపడిన కొండచరియలను రెండు రోజుల్లో తొలగిస్తామని జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. సోమ, మంగళవారాలు ఘాట్ రోడ్డును మూసివేస్తున్నామని కొండవీడుకు రావద్దని హెచ్చరించారు.

11 మండలాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా నిరాశ్రయులైన వారిని ఆదుకోనేందుకు జిల్లా యంత్రాంగం 11 మండలాల్లో పునరావాస కేంద్రాలను నెలకొల్పింది. ఆదివారం సాయంత్రానికే 1462 కుటుంబాలను ఆయా కేంద్రాలకు తరలించి వారికి ఆశ్రయం కల్పించింది. పెదకాకాని మండలంలోని నంబూరులో వేమన జడ్పీహెచ్‌ఎస్‌లో 52 కుటుంబాలు, పెదకాకాని లూథర్ గిరి కాలనీ స్కూల్‌లో 111 కుటుంబాలకు ఆశ్రయం ఏర్పాటు చేసింది. మేడికొండూరు మండలంలోని పాలడుగులో ఉన్న నాడు - నేడు స్కూల్‌లో ఒక కుటుంబానికి ఆశ్రయం కల్పించింది. తుళ్లూరు మండలంలోని ఉద్దండ్రాయునిపాలెంలో 45, వెంకటపాలెంలో 30, హరిశ్చంద్రాపురంలో 35, లింగాయపాలెంలో 26, తుళ్లూరులో 35, రాయపూడిలో 200, మందంలో 15, వట్టిచెరుకూరులో 19 కుటుంబాలకు ఆయా గ్రామాల్లోని ఎంపీయూపీ స్కూళ్లలో వసతి కల్పించారు. రాయపూడి లంక ప్రజలను ఇబ్రహీంపట్నంకు తరలించారు. తెనాలిలోని కోపల్లెలో 5, మంగళగిరిలోని ఆత్మకూరులో 5, తాడేపల్లిలోని మహానాడు-1లో 245, మహానాడు-2లో 260, వడ్డేశ్వరంలో 12, నులకపేటలో 45, దుగ్గిరాల ఈమనిలో 40, దుగ్గిరాలలో 24, పెదకొండూరులో 3, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశారు. పొన్నూరులో 19 మందిని అక్కడి ఎలిమెంటరీ స్కూల్‌కు తరలించారు. పునరావాస కేంద్రాలకు జిల్లాస్థాయి అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి భోజనం, తాగునీరు వంటి సదుపాయాలను కల్పిస్తున్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 1 : కొల్లిపర మండలం లోని 36 మంది సచివాలయ సిబ్బందికి సకాలంలో పెన్షన్లు పంపిణీ చేయలేదన్న కారణంతో జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం వర్షం కురుస్తున్నందు వల్ల 36 మంది సచివాలయ ఉద్యోగులు 8 గంటలకే పెన్షన్ పంపిణీ మొదలు పెట్టలేదని అన్నారు. దాని నిమిత్తం అక్కడి ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా వర్షం కారణంగా పెన్షన్లు పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని చెప్పిన సంగతిని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి

కారంపూడి, సెప్టెంబరు 1: మండల కేంద్రమైన కారంపూడి ఇందిరానగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ నాగేటి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. వారం రోజుల క్రితం దుర్గిలో తన బంధువుల ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తూ మార్గమధ్యంలోని అడిగొప్పల బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబసభ్యులు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దాదాపు 24 ఏళ్లపాటు దేశానికి సేవలందించి గత జనవరి 31న రిటైర్ అయ్యారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు



మాచర్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చంద్రవంక వాగు



బెల్లంకొండ పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీరు

ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలి..

బెల్లంకొండ: వర్షాలకు నాగార్జునసాగర్‌నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి యమ్మాజీగూడెం ముంపునకు గురయ్యే అవకాశముందని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ మున్నీసాబేగం సూచించారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బెల్లంకొండ జెడ్పీ పాఠశాల ఆవరణ అంతా వర్షపు నీటితో నిండి పోయింది.

మండలంలోని యమ్మాజీగూడెం, బెల్లంకొండ పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వర రావు పేర్కొన్నారు. యమ్మాజీ గూడెం గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అలాగే బెల్లంకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

అమరావతి: ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటితో కృష్ణానది తన అంచులు దాటి నిండుదనంగా పరవళ్లు తొక్కుతుండగా గత రెండు రోజుల నుండి పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు,సత్తెనపల్లి, తాడికొండ యోజకవర్గాల పరిధిలో కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగులు పెదమద్దూరు వద్ద కలవడంతో సమీపంలోని వాగుపై ఉన్న చప్టామీదగా వరద నీరు ప్రవహిస్తుండటంతో విజయవాడకు వెళ్లే వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణానదిలో పులిచింతల ప్రాజెక్టు నుండి సుమారు 7లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండటంతో అధికారులను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేశారు.



క్రోసూరు మండలం దొడ్లేరు చెరువుకు గండి పెట్టడంతో ప్రవహిస్తున్న నీరు

జనజీవనం అస్తవ్యస్తం

మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని వాగులు వంకలు ప్రమాదకర స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలా మారాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రజల జీవనం స్తంభించిపోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రత్యక్షంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

- మాచర్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న చంద్రవంక
- రెంటచింతల గోలి వాగు వద్ద పోలీసు కాపలా..
- పిడుగురాళ్లలో ఆక్రమణలతో దారిమళ్లిన ఎర్రవాగు
- సహాయక చర్యల్లో అధికారులు, సిబ్బంది
- వరద ఉధృతి ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు

మాచర్లటౌన్, సెప్టెంబరు 1: మాచర్ల పట్టణంలోని చంద్రవంక నది ఆదివారం పోటెత్తింది. దీంతో పట్టణం నుంచి జమ్మలమడక వెళ్లే రహదారికి రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. తహసీల్దార్ జియాఉల్‌హక్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు, పట్టణ సీఐ ప్రభాకరరావులు చప్టా వద్ద సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

రెంటచింతల: గోలి వాగు మహా ఉధృతంగా ప్రవహిస్తూనే ఉంది. ఆర్టీసీ బస్సులను వెనుకకు మళ్లించగా లోడ్ లారీలు వాగుకు ఇరువైపులా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు అలానే నిలిచిపోయాయి. ఎస్ఐ సీహెచ్ నాగార్జున, తహసీల్దార్ కరుణకుమార్ అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరిస్థితి గురించి వారితో ఎప్పటికప్పుడూ మాట్లాడుతూ సూచనలు అందజేస్తున్నారు. గోలివాగు మరమ్మతుపై ఎన్‌హెచ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడారు.

వెల్దుర్తి: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. వరద నీటి దాటికి చెరువులు నిండి అలుగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగు ఉధృతికి సమీపంలోని పంటపొలాలు తుడిచిపెట్టుకుపోయాయి. రచ్చమలపాడు చప్టాపై వాగు ఉధృతికి కట్టలు తెగిపోయి పొలాలు మేటవేశాయి.

దుర్గి: మండలంలోని ముటుకూరు సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో లోలెవల్ చప్టా వాగు ఉధృతిలో కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ తన సొంత ఖర్చుతో ట్రాక్టర్ల ద్వారా మట్టితోలించి చప్టాపై రాకపోకలు జరిగేలా చదును చేయించారు. దీంతో ప్రజలు ఆయనను అభినందించారు.

కారంపూడి: మండలంలోని చినగార్లపాడువద్ద మందలపు వాగుపై వంతెన పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్టాండ్ వెనుక వున్న చెరువు, సమీపంలోని ఆక్రమణలకు గురవడంతో వరద దారిమళ్లింది. దీంతో రజక కాలనీకి వెళ్లే రహదారి కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. ఆ చప్టాపై నుంచి రాకపోకలను పోలీసు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు.

దాచేపల్లి: నాగార్జున సాగర్ డ్యామ్ నుంచి వస్తున్న వరద నీటితో ఇబ్బంది పడుతున్న వరద బాధితులను అన్నివిధాల ఆదుకుంటామని గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కృష్ణానది తీరప్రాంత గ్రామాలైన రామాపురం గ్రామంలోని వరద బాధిత కుటుంబాలను, నీటి మునిగిన గృహాలను ఆయన పరిశీలించారు. వరద బాధితులకు ఆంధ్రా సిమెంట్స్ యాజమాన్యం భోజన వసతి కల్పించారు.

సత్తెనపల్లి : నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశిం చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాలు తగ్గే వరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు మునిసిపల్‌కమిషనర్ షమ్మి తెలిపారు. వరదబాధితుల సహాయార్థం జిల్లాలోని ఏరియా వైద్యశాలలు, కమ్యూనిటీ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. వైద్యశాలల్లో అన్ని రకాల మందులు ఉన్నాయని వైద్య విధాన పరిషత్ జిల్లా ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ డాక్టర్ మంత్రు నాయక్ తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామలో నీట మునిగిన పత్తిపొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు పంటల రక్షణపై జాగ్రత్తలను వివరించారు.

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లి గ్రామ సమిపంలో ఉన్న వాగు, అనుపాలెం గ్రామం సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహించటంతో ఆయా ప్రాంతాలలో రాకపోకలు స్థంభించిపోయాయి. బలిజేపల్లి వాగువద్ద తహసీల్దార్ దుర్గేష్, ఎస్ఐ వేణుగోపాల్‌లు ఎన్డీఆర్ఎఫ్ టీంను ఏర్పాటు చేశారు.

నకరికల్లు : ఎస్సీ కాలనీలో రెండు మట్టి మిద్దెలు, ఒక పూరి గుడిసె పూర్తిగా దెబ్బతిన్నాయి. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్టు తహసీల్దార్ కే.పుల్లారావు తెలిపారు.



బలిజేపల్లి వద్ద వాగు వద్ద ఎస్‌డిఆర్‌ఎఫ్ టీంతో మండల అధికారులు

ముప్పాళ్ళ : మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పత్తి పొలాలను సహాయ వ్యవసాయ సంచాలకులు రవి కుమార్ పరిశీలించారు. పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాకులు ఎస్ శ్రీధర్‌రెడ్డి, పీ ప్రవీణ్ కుమార్, ముప్పాళ్ళ ఏవో అరుణ తదితరులు ఉన్నారు.

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్ళూరు నుంచి గుంటూరు వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డులో పరస - కంభంపాడు గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని లింగంగుంట్ల, బలుసుపాడు, పొడపాడు, పరస, కంభంపాడు, జలాలపురం గ్రామాల్లో కొండవీటి వాగు కింద ఉన్న పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది.

అకాల వర్షాలకు రైతులు జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టం వాటిల్లదని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఇంజం శాంతి అన్నారు.మండలంలోని పాటిబండ్ల, ముస్సాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు.

క్రోసూరు: వరద నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు దొడ్లేరు చెరువు కట్టకు గండి పెట్టి నీటిని మళ్ళించారు. దీంతో వరద నీరంతా పొలాల్లో ప్రవహించడంతో మాగాణి పంట పూర్తిగా మునిగి పోయింది. వందలాది ఎకరాల్లో పంట నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క దొడ్లేరు చెరువు నుంచి నీటి ప్రవాహం ఆర్అండ్‌బీ రోడ్డు పై చేరటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. క్రోసూరు చెంచు కాలనీ వరద బాధితులకు స్థానిక జిల్లా పరషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లాపౌర సరఫ రాలశాఖ అధికారి, క్రోసూరు మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ సందర్శిం చారు. బాధితులకు మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మండలంలోని పీసపాడు, పారుపల్లి, క్రోసూరు, అనంతవరం, గ్రామాల్లోని పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు వీ హనుమంతరావు, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ పలువురు పరిశీలించారు. పంటల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు.



మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో రహదారిపై నిలిచిన మురుగునీరు



దాచేపల్లి మండలం రామాపురం వద్ద కృష్ణానది ఒడ్డున నీటమునిగిన సీతారామ దేవాలయం



కారంపూడి మండలం సమీపంలో కోతకు గురైన మందలపు వాగు వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు



దుర్గి, ముటుకూరు సమీపంలో వరద ఉధృతికి చప్టా కొట్టుకు పోవడంతో మరమ్మతు పనులు చేయిస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్



ముప్పాళ్ల మండలంలో పత్తి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



నకరికల్లులో వర్షాలకు దెబ్బతిన్న ఇంటి వద్ద నష్టం వివరాలను సేకరిస్తున్న వీఆర్‌వో సానా గౌరి



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, యువకులు


కనుల పండువగా అంకాలమ్మ బోనాలు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 1: పట్టణంలోని ఇందిరానగర్ చెందిన వడియరాజులు ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పొంగళ్లు నిర్వహించి బోనాలతో పట్టణ పురవీధుల్లో మేళతాలతో ఊరేగింపుగా ఏనుగుపాలెం రోడ్డులోని అంకాళమ్మ తల్లికి పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర జలాశయాలు నిండి కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ సురేష్, పత్తిపూర్ణ, సౌదాగర్ జానీ భాష, వడియరాజుల సంఘం అధ్యక్షుడు చల్లా కుమార్, యర్లవాసు, దేవళ్ళ ఏసుపాదం, బత్తుల శ్రీను, తమ్మిశెట్టి వెంకటస్వామి, బి.వెంకటకోటయ్య, తురకా ఏడుకొండలు, వేముల గోవిందు, చల్లా శివయ్య, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ఉప్పరపాలెం (ఈపూరు) సెప్టెంబరు 1: మండలంలోని ఉప్పరపాలెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సల్లూరి పేరయ్యకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో నుంచి మంటలు వస్తుండడంతో చుట్టుపక్కల వాళ్ళు మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. ప్రమాదంలో దుస్తులు, నిత్యావసర సరకులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

వినుకొండ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కే ఇస్మాయిల్



వినుకొండ టౌన్, సెప్టెంబరు 1: వినుకొండ మున్సిపల్ శానిటర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కే ఇస్మాయిల్ ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో వినుకొండలో విధులు నిర్వహిస్తూ బదిలీపై చిలకలూరిపేటకు బదిలీఆయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా వినుకొండకు బదిలీ చేశారు.

200 మందికి పైగా జనసైనికుల రక్తం దానం

వినుకొండ, సెప్టెంబరు 1: ఈ నెల 2వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా వినుకొండ జనసేన పార్టీ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 200మంది యువత పాల్గొని రక్తందానం చేశారు. టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రజాక్ జనసేన నాయకులు, కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మందిర సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

చిలకలూరిపేట, సెప్టెంబరు 1: వెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మందిర సంఘం నూతన కమిటీ సభ్యులు ఆదివారం కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పదవీ స్వీకారం చేశారు. గౌరవాధ్యక్షుడిగా మద్ది వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చేవూరి కృష్ణమూర్తి అదనపు కార్యదర్శిగా అరవపల్లి వెంకటసుబ్బారావు, కోశాధికారిగా ఎం.రాజీవ్, ఉపకోశాధికారిగా రాచుమల్లు నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని నూతన కమిటీని అభినందించారు. కల్యాణ మండపంలో ఏసీ ఏర్పాటుకు రూ.5లక్షలు ఇచ్చిన చేవూరి కృష్ణమూర్తి, ఇతర దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గుర్రం సాంబశివరావు పలువురు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు

● జనజీవనం అస్తవ్యస్తం ● ముంపులో పొలాలు ● అన్నదాతలకు తీవ్ర నష్టం ● అధికారులు అప్రమత్తం





బొల్లాపల్లి, లక్ష్మీపురం తండా మధ్య కొట్టుకుపోయిన రోడ్డు, కుప్ప గంజి వాగును పరిశీలిస్తున్న చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ హుస్సేన్ బాషా







చిన్నకంచర్ల వెళ్లే కొంకేరువాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్, ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లేడవాగు, నెహ్రూ నగర్ తండాలో మునిగిన మిర్చి పొలాలు





చాకలికుంట తండాలో వర్షాలకు పడిపోయిన ఇల్లు, నరసరావుపేట మండలం లింగంగుంట్ల రాజుపాలెం కాలనీలో నిలిచిన వరద నీరు

వినుకొండ, సెప్టెంబరు 01: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని వీధులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాలకు వర్షం నీరు చేరాయి. నీరు నిల్వ ఉండడంతో కనీసం వంటలు ఒండుకోలేక పిల్లలు పెద్దలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి. వర్షంనీటిని తోడలేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోటున్నారు. ప్రధానంగా నరగాయకట్ట బజార్, సంజీవ్ గాంధీ నగర్, ముట్లకుంట కాలనీ, డ్రైవర్ కాలనీ, శృంగారపువనం తదితర ప్రాంతాల్లో వర్షం నీటి తాకిడికి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో కాల్ సెంటర్ ఏర్పాటుచేసి పట్టణంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వాగుల వద్ద అధికారుల ముందు జాగ్రత్త చర్యలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 1: చిలకలూరిపేట మండలంలో భారీ వర్షాలకు పలువాగులు పొంగి పొర్లుతున్నాయి. చిలకలూరిపేట వేలూరు మధ్య, కోమటినేనివారిపాలెం గోవిందపురం మధ్య ఓగేరు, కుప్పగంజి వాగులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట మండల ప్రత్యేక అధికారి బి నారదముని, తహసీల్దార్ షేక్ హుస్సేన్ భాష పరిస్థితిని సమీక్షించారు. వాగుల వద్దకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వాగులకు రెండువైపులా ముళ్లకంచెలు వేయించారు. ఎవరూ వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని వారు హెచ్చరించారు. పోలీసు సిబ్బంది కూడా వాగుల వద్ద కాపలా కాస్తున్నారు.

నీట మునిగిన మిర్చి పొలాలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 1: మండలంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నెహ్రూనగర్ తండాలోని పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయని సదరు పొలాల రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని నెహ్రూ నగర్ తండా రైతులు కోరుతున్నారు.

వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు

బొల్లాపల్లి, సెప్టెంబరు 1: మండలంలోని బొల్లాపల్లి - లక్ష్మీపురం తండా వెళ్ళే రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకు పోవటంతో నడిచేందుకు వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మత్తులు చేయాలని తండా వాసులు కోరుతున్నారు.

● రొంపిచర్ల: మండలంలోని చాకలికుంట తండాలో అంతావర్త్ చిన తులసీ నాయక్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. రొంపిచర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి, మునమాక, విప్పర్లపల్లి, మాచవరం గ్రామాల మధ్య వర్షపు నీరు చప్టాలపై నుంచి ప్రవహిస్తుంది. తహసీల్దార్ నిర్మల విప్పర్లపల్లి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

● నూజెండ్ల: భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి జల కళను సంతరించుకున్నాయి. గుండ్లకమ్మ నదిలో ఏర్పాటు చేసిన మోటార్లను రైతులు విద్యుత్ మోటార్లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

● ఈపూరు: ఈపూరు నుండి నర్సరావుపేట వెళ్ళే రోడ్డులో ముప్పాళ్ళ వద్ద వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పంది. వినుకొండ-హైదరాబాద్ ఆర్‌బీరోడ్డులో కూచినపల్లి వద్ద చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయి రాకపోకలు నిలిచాయి.

● నాదెండ్ల: మండల పరిధిలో ప్రవహిస్తున్న కుప్పగింజి, నక్క వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వరద పరిస్థితులపై జీవీ సమీక్ష

వినుకొండ. సెప్టెంబరు 1: భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వరదనష్టం, సత్వర సహాయక చర్యలపై ఆదివారం హైదరాబాద్ నుంచి అధికారులతో సోమవారం సమీక్ష చేశారు. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, జలవనరులు, విద్యుత్, పోలీస్ సహా పలు శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎప్పటికప్పుడు వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. రైతులకు పంట నష్టంపై వేగంగా స్పందించాలని ఈసందర్భంగా వ్యవసాయ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ విభాగం అధికారులు ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలపై పూర్తిగా సన్నద్ధతో ఉండాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలో ఎక్కడైనా రోడ్లు దెబ్బతిని ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

విద్యా సంఘం అధ్యక్షుడిగా తేళ్ళ తిరిగి ఎన్నిక

చిలకలూరిపేట, సెప్టెంబరు 1: శ్రీచిలకలూరిపేట విద్యాసంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో జరిగాయి. విద్యా సంఘం అధ్యక్షుడిగా తేళ్ళ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శిగా ఎంవీఎస్ శివానందకుమార్, సహాయ కార్యదర్శిగా బేతంచర్ల రామకోటేశ్వరరావు, కోశాధికారిగా బచ్చు రామలింగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యా సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పరామర్శ

● సీఐ చొరవతో ఆందోళన విరమణ

చిలకలూరిపేట, సెప్టెంబరు 1: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆత్మహత్య చేసుకున్న కారసాల వసంతరావు బంధువులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం నిరసనకు దిగారు. వసంతరావుది ఆత్మహత్య కాదని, అతడిని హత్య చేశారని బంధువులు ఆరోపించారు. మృతుడి బంధువులు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి రోడ్డుమీద బైఠాయించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. అర్బన్ సీఐ సీహెచ్ రమేష్ చొరవతో వారు ఆందోళన విరమించారు. కాగా స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వసంతబాబు మృతదేహాన్ని సందర్శించి అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని పోలీసులను ఆయన కోరారు.

బ్రాహ్మణసేవా సమితి భవనానికి లక్ష విరాళం

చిలకలూరిపేట, సెప్టెంబరు 1: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన చిన్న పసుమర్రు వద్ద ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రాహ్మణ సామాజిక భవన నిర్మాణానికి సమితి సభ్యుడు దివంగత రాళ్ల బండి ఆంజనేయులు కుమారులు రాళ్లబండి సాయిరాం, రాళ్లబండి సాయికృష్ణ సోదరులు రూ.లక్ష నూట పదహారు విరాళాన్ని ఆదివారం ప్రకటించారు. సమితి అధ్యక్ష కార్యదర్శులు ఏక మారుతీ రామిశర్మ, పోలూరి రామచంద్రమౌళిలకు ఈ విరాళాన్ని అందచేశారు. వారిని సమితి సభ్యులు అభినందించారు.

పంటలను కాపాడుకుందాం: ఏవో అంజిరెడ్డి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 1: అల్పపీడనం తాకిడికి మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన పంటలను కాపాడుకునేందుకు వినుకొండ వ్యవసాయ అధికారి అంజిరెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. పొలం ఆరేలా చూడాలన్నారు. మిల్లీ-శె(13.0.45)10 గ్రాములు లేదా, పోలీఫిడ్(19.19.19)10 గ్రాములు లేదా, యూరియా 20గ్రాములు+మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. 90రోజులలోపు వయసు ఉన్న పొలంలో బూస్టర్ డోస్‌గా 30 కేజీలు యూరియా +10 కేజీలు పోటాషియం ఒక ఎకరాకు పిచికారి చేయాలన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఇన్‌చార్జి ఎంఏవో

శావల్యాపురం, సెప్టెంబరు 1: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు అన్నారు. మండలంలోని పొట్లూరు, శావల్యాపురం గ్రామాలలో సాగులో ఉన్న మొక్కజొన్న, వరిపంటలను ఆయన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామారావు మాట్లాడుతూ మండలంలోని 11సచివాలయాలపరిధిలో 380ఎకరాల్లో రైతులు వరి, మొక్కజొన్న, కంది, మిరప, నిమ్మ, జామ, సపోటా, సుబాబుల్ పంటలను సాగుచేశారన్నారు. 250ఎకరాలను ఈ-పంటలో నమోదు చేశామన్నారు. వరి పంట దెబ్బతినకుండా నీటిని వెల్లబెట్టి 30కేజీల యూరియా, 15కేజీల ఎంవోపీలను వేయాలన్నారు. పొటాష్ వేయడం వల్ల బ్యాక్టీరియల్ ఈబ్రైట్‌ను నివారించవచ్చన్నారు. వరిలో ఎలుకలఉధృతి తగ్గేందుకు బ్రోమోడయోలిన్ పిచికారీ చేయాలి.